క్లుప్తంగా

పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం



విద్యార్థులతో అంబవరం ప్రభాకరరెడ్డి, మురళీధరన్ తదితరులు

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేట ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో గ్రామాలయ ప్రభుత్వేతర సంస్థ, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం మరుగుదొడ్లు నిర్మించారు. జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి శనివారం నూతన టాయిలెట్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలయ ప్రభుత్వేతర సంస్థ వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి జిల్లాలో 50 పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మిస్తున్నారన్నారు.ఒక్కో మరుగుదొడ్డి కోసం దాదాపు రూ.3లక్షలు ఖర్చు చేస్తున్నారన్నారు. ఈ మంచి పనికి సంస్థ వారిని అభినందిస్తున్నామన్నారు. నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న గ్రామాలయ ప్రభుత్వేతర సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మురళీధరన్‌ను సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీ ప్రభాకర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకరయ్య, పాఠశాల హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు విశాలాక్షి, ఈశ్వరయ్య, గీత, హెల్త్ ఎడ్యుకేటర్ సునీల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు అందజేత

రాయచోటి అర్బన్: పట్టణంలోని యాచకులకు శనివారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యుడు ఈశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు విశ్వనాథ నాయక్ పట్టణంలోని 10 మంది యాచకులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నేత రామాంజనేయులు, భానాస రాయలసీమ కన్వీనర్ పల్లం తాతయ్య, జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు యుగంధర్, దళితసేన నేత శ్రీనివాసులు, గిరిజన సంఘం నేతలు శంకర్‌నాయక్, రాజారాం నాయక్, ఎల్లప్ప, దేవరాజ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ క్యాలండర్ ఆవిష్కరణ



క్యాలండర్ విడుదుల చేస్తున్న ఉపాధ్యాయులు

రాయచోటి అర్బన్: ముస్లిం, మైనార్టీ ప్రజల సౌకర్యార్థం వారికి ఉర్దూ క్యాలండర్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పీఆర్‌టీయూ రాష్ట్రనేత శ్రీనివాసరాజు తెలిపారు. శనివారం పట్టణంలోని ఉర్దూపాఠశాలలో ఆప్‌కి ఆవాజ్ సంస్థ ముద్రించిన క్యాలండర్‌ను శ్రీనివాసరాజు, హెచ్‌ఎం చంద్రశేఖర్, అంజుమన్ తరక్కీఉర్దూ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్‌హాషిం, ఖదీర్‌పర్వేజ్, ఆప్‌కి ఆవాజ్ రాష్ట్రకార్యదర్శి మగ్బూల్‌బాషా తదితరులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాదర్‌బాషా,ఏసీసీ ఆఫీసర్ నాగరాజు, ఎస్‌ఎం షఫీ, బాల్జీ పాల్గొన్నారు.


యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్..



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పుల్లంపేట: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) పుల్లంపేట శాఖ వారు శనివారం తహసీల్దార్ నరసింహ ప్రసాద్, ఎంఈఓ రంగనాథయ్య, ఎస్ఐ సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సాంబశివరావు, సీనియర్ నాయకుడు వరదారెడ్డి, గౌరవాధ్యక్షుడు కె శంకరయ్య, జిల్లా కార్యదర్శి సీవీ రమణమూర్తి, ట్రెజరర్ ఎస్‌వీ రమణ, కాంప్లెక్స్ సెక్రటరీ విశ్వనాథ్, చంద్రశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాలలో అతిథి భోజనం



బావికాడపల్లి పాఠశాలలో భోజనాలు చేస్తున్న విదార్థులు

పుల్లంపేట: మండలంలోని బావికాడపల్లి ప్రాథమిక పాఠశాలలో కొవ్వూరు సుబ్బరాయుడు మనువడు కె నవనీత్ (5వ తరగతి) పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. నవనీత్‌ను ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు, ఉపాధ్యాయిని శాంతకుమారి పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

రాయచోటిటౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లెలో శనివారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. సంక్రాంతి వరకు ఈ పోటీలు జరుగుతాయని మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి చెప్పారు. శనివారం పోటీలను ఆయన ప్రారంభించారు. గ్రామీణ యువకులకు క్రీడలపై మక్కువ పేంచేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రికెట్ నిర్వహకుడు ధర్మారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమీపిస్తున్న సంక్రాంతి

- షాపింగ్ కోసం భారీగా పట్టణానికి వస్తున్న ప్రజలు
- జఠిలమవుతున్న ట్రాఫిక్ సమస్య



పాతపోలీస్‌లైనువీధిలో ట్రాఫిక్ పరిస్థితి

రాజంపేట టౌన్: సంక్రాంతి పండుగ సమీపిస్తుండటంతో ప్రజలు తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసేందుకు పట్టణానికి నిత్యం వేల సంఖ్యలో వస్తున్నారు. దీంతో వ్యాపార సముదాయలున్న ప్రాంతాల్లోనే కాక దాదాపు అన్ని ప్రాంతాల్లో రద్దీ వాతావరణం నెలకొంటోంది. ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి 8 వరకు ఎక్కడ చూసినా జనం తండోపతండాలుగా కనిపిస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. ప్రధానంగా పాతపోలీసులైనువీధి, బండ్రాళ్ళవీధి, నాగులమానువీధి, గాంధీ సర్కిల్, శివాలయం సెంటర్, మెయిన్‌రోడ్డు, ఆర్‌ఎస్‌రోడ్డు ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది.పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం అనేక మార్లు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పోలీసులు కొన్ని ప్రాంతాల్లో ఉంటూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపడుతున్నారు.ఒక్కోమారు వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో పోలీసులు సైతం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు కష్టాలు పడాల్సి వస్తోంది.

సమస్య పరిష్కారానికి వన్‌వేనే మార్గం

ప్రస్తుతం పట్టణానికి ప్రజలు పెద్దఎత్తున వస్తున్నందున వన్‌వే మార్గాన్ని ప్రవేశ పెడితేనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని వాహనదారులు చెబుతున్నారు. పట్టణంలో పాతపోలీసులైనువీధి, గాంధీసర్కిల్, నాగులమానువీధి, బండ్రాళ్ళవీధులు ప్రధాన వ్యాపార సముదాయాలుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యను అధికమించేందుకు గతంలో పోలీసులు రోజుకు ఒకవైపు ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. పోలీసుల చర్యలు సత్ఫలితాలనే ఇచ్చాయి. అయితే ప్రస్తుతం పట్టణ వాసులతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తుండటంతో వాహనాల పార్కింగ్‌కు పోను ఉన్న స్థలంలోనే వాహనదారులు, పాదాచారులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ట్రాఫిక్ సమస్యకు ఇప్పుడు ఇదే ప్రధాన కారణమవుతుంది. వ్యాపార సముదాయాల్లో, ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.

మరింత దృష్టిసారిస్తాం



సంక్రాంతి పండుగ దగ్గర పడుతుండటంతో ప్రజలు తమకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసేందుకు పట్టణానికి అధిక సంఖ్యలో వస్తున్నమాట వాస్తవమే. పండుగ సీజన్ అయినందున మరింత దృష్టిసారిస్తాం. ఇందుకోసం ఎక్కువ మంది సిబ్బందిని కూడా ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యను అధిగమిస్తాం. ప్రజలు కూడా సహకరించాలి. – నరసింహారావు, సీఐ, అర్బన్ పోలీస్ స్టేషన్, రాజంపేట

కోదండ రామయ్యకు స్నపన తిరుమంజనం



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శనివారం స్వామివారికి వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ స్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ టీటీడీ అధికారులు ఆధ్వర్యంలో సుప్రభాత సమయాన స్వామివారికి పట్టు వస్త్రాలు, పుష్పాలు, ఫలాలు సమర్పించారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ పండితులు వేద పారాయణం, కుంకుమార్చన, మంగళహారతులతో విశేష పూజలు నిర్వహించారు.

శ్రీ లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ మండెంలక్ష్మీనరసింహస్వామి

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లె గ్రామంలో వెలిసిన శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మూలవిరాట్‌మూర్తిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు. పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

నామాలగుట్ట శ్రీవెంకటేశ్వర స్వామికి..

లక్కిరెడ్డిపల్లె: మండలంలోని రామాపురం వేళ్లే మార్గంలో నామాలగుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామికి పడి పూజ, అభిషేకాలు జరిపారు.అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాయచోటి–వేంపల్లె మార్గమధ్యమంలోని మర్రిచెట్టు వద్ద వెలసిన శ్రీ లక్ష్మీనృసింహ్మా స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



మాట్లాడుతున్న వైఎస్సార్ క్రాంతిపథం సహాయ ప్రాజెక్టు మేనేజర్ ఖాదర్ వలి

వీరబల్లి : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించుకోవచ్చని వైఎస్సార్ క్రాంతి పథం సహాయ ప్రాజెక్టు మేనేజర్ ఖాదర్ వలి అన్నారు. శనివారం స్థానిక సచివాలయంలో రక్తహీనత వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. పీహెచ్‌ఎస్ గంగులమ్మ మాట్లాడుతూ మహిళలు ఐరన్ ఎక్కువగా ఉన్న రాగి సంగటి, రొట్టి, జావా, ఖర్జూరాలు, బెల్లంతో చేసిన పిండి వంటలు ఎక్కువగా వాడాలన్నారు. సచివాలయ ఏఎన్‌ఎం శిరీషా మాట్లాడుతూ రక్తహీనత నివారణ కోసం ఆకు కూరలు, కూరగాయలతో కూడిన ఆహారం ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్ వాడీలు ద్వారా అందించే పౌష్టికాహారాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు, సీసీ కుల్లాయప్ప, వీఓఏ భాగ్యమ్మ, నాగయ్య పాల్గొన్నారు.

మండల వ్యవసాయ అధికారిగా రాజకుమారి



రాజకుమారి

రాజంపేట రూరల్: రాజంపేట మండల వ్యవసాయ అధికారిగా జీ రాజకుమారి శనివారం బాధ్యతలు చేపట్టారు. రామాపురం మండలంలోని గువ్వలచెరువు హెడ్ క్వార్టర్‌లో వ్యవసాయ విస్తరణ అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై రాజకుమారి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మండల వ్యవసాయ అధికారి ఎన్‌వీకే సుబ్రమణ్యం రైల్వేకోడూరుకు బదిలీపై వెళ్లారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



గాలివీడు: వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ శివకుమార్

గాలివీడు: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, ఇచ్చిన తదనంతరం జరిగే పరిణామాలకు తల్లితండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

రామాపురం: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని కడప – రాయచోటి ప్రధాన రహదారిలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆటోలు మిగతా వాహనదారులు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని చెప్పారు.

వృద్ధులకు అన్నదానం

రామాపురం: మండల పరిధిలోని బండపల్లె వద్ద ఉన్న ప్రేమాలయం వృద్ధాశ్రమంలో శనివారం ఎస్‌బీఐ మేనేజర్ డి.వి.రమణ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు వంశీకృష్ణ ఆర్థిక సహాయంతో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ మాట్లాడుతూ పేద ప్రజలకు సహాయం చేసే అవకాశం రావడం భగవంతుడు మానవులకు ఇచ్చిన గొప్ప వరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో లయన్ వెంకటచలపతి, నందిని ట్రావెల్స్ వినోద్‌కుమార్ నాయక్, దాత కుటుంబ సభ్యులు రాజేశ్వరి, నాగజ్యోతి, సరోజమ్మ, శివమ్మ, కుమారి, జాన్, భారతి, వెంకటకృష్ణ, సాకేత్, దేవ, కృతిక, ప్రేమాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ముక్కావారిపల్లె పంచాయతీలో జగనన్న కాలనీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయారావు

ఓబులవారిపల్లె: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరిగేలా కృషి చేయాలని ఎంపీడీఓ విజయారావు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు సూచించారు. శనివారం ముక్కావారిపల్లె పంచాయతీలోని జగనన్న కాలనీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయాలని, అందుకు కావాల్సిన అన్ని విధాల సహాయ సహకాలను అందజేస్తామని చెప్పారు. కడ్డీలు, సిమెంట్, బిల్లులు ఎమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారం చేయిస్తామని అన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో జగనన్న కాలనీల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పనులు పూర్తి చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సంజీవరాయస్వామికి పొంగళ్లు

పుల్లంపేట: మండల పరిధిలోని తిప్పాయపల్లె గ్రామంలో ఉన్న సంజీవరాయస్వామికి ఆదివారం పొంగళ్ల నిర్వహించనున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు. సంక్రాంతి పర్వదినం ముందు జరిగే ఈ కార్యక్రమానికి ప్రత్యేకత కలదు. మహిళలకు అనుమతి లేదు. పురుషులు మాత్రమే కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. గ్రామ ప్రజలు దూర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. రాజంపేట ఆర్టీసీ డిపో నుంచి తిప్పాయిపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కూడా కల్పించారు.

శుభ్రతతో వ్యాధులు దరిచేరవు



మాట్లాడుతున్న జిల్లా హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి సత్యనారాయణ

గాలివీడు: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, శుభ్రతతో వ్యాధులు దరిచేరవని జిల్లా హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బి రెడ్డన్న ఆధ్వర్యంలో చర్మవ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు పి నాగరాజు, వి నరేంద్ర, వెంకటేశ్వర నాయక్, వైద్య సిబ్బంది జ్యోతి, లక్ష్మీదేవి ు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీలో రాజకీయ నేతల ప్రమేయం తగదు

రాజంపేట రూరల్: ఐసీడీఎస్‌లో నూతనంగా చేపట్టే ఉద్యోగాల భర్తీలో రాజకీయ నాయకుల ప్రమేయం తగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీ రవికుమార్ పేర్కొన్నారు. శనివారం ఇక్కడ ఆయన విలేకరులతో ఐసీడీఎస్‌లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను విద్యార్హతను బట్టి భర్తీ చేయాలన్నారు.పదోన్నతులు ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలోనే జరగాలని కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి

రాజంపేట: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాజంపేట సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి అన్నారు. శనివారం తాళ్లపాకలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మహిళలు తమ రక్షణ కోసం తీసుకొచ్చిన చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. ఖాళీబాండ్లపైన సంతకాలు పెట్టరాదని తెలిపారు. డబ్బు తీసుకున్న వారు చెల్లించకుంటే ప్రానోట్‌ను మూడుసంవత్సరాలలోగా కోర్టులో దాఖలు చేసుకోవాలని, లేకపోతే ప్రామిసరీనోట్ చెల్లదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనువాసులు, నాగేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకముందు సబ్‌జైలును ఆమె తనిఖీ చేశారు.

ఏడీజె కోర్టులో లోక్‌అదాలత్

రాజంపేట ఏడీజె కోర్టులో జడ్జి మురళీకృష్ణ అధ్యక్షతన లోక్‌అదాలత్ నిర్వహించారు. ఇందులో సీనియర్ సిటిజన్‌కు సంబంధించి భరణం కేసును పరిష్కరించారు. రాజీకాదగిన కేసులను ఫిబ్రవరి 11వతేదిన జరిగే నేషనల్ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు



చిట్లూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న జయరాణి

రామాపురం: వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జయరాణి పేర్కొన్నారు. శనివారం మండలంలోని చిట్లూరు గ్రామంలో రైతులు సాగు చేసిన వేరుశనగ పొలంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ విత్తనం విత్తే ముందు నుంచి విత్తనం తయారయ్యే వరకు రైతులు అవలంభించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామాపురం రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమిలో చెట్లు తొలగింపు



ప్రభుత్వ భూమిలో నాటిన మామిడి చెట్లను తొలగిస్తున్న దృశ్యం

పెనగలూరు: మండలంలోని దామనచెర్ల గ్రామంలో ఆక్రమిత భూమి పది ఎకరాల్లో నాటిన మామిడి చెట్లను తొలగించినట్లు తహసీల్దార్ శ్రీధర్‌రావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.మండలంలోని వీఆర్‌ఓలతో ప్రభుత్వ భూముల్లో వేసిన మామిడి చెట్లను పూర్తిగా తొలగించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరి

వాల్మీకిపురం : ఈకేవైసీ చేసుకుంటేనే పీఎం కిసాన్ 13వ విడత నగదు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ అన్నారు. శనివారం వాల్మీకిపురం-1 రైతు భరోసా కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేసి, రైతు భరోసా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు దగ్గరలోని సిఎస్‌సి సెంటర్లు, రైతు భరోసా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

కలకడ : జిల్లాలోని ప్రతి రైతూ ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరి అన్నారు. ఈనెల15వ తేదీలోపు ఈకేవైసీ చేసుకున్నవారికి మాత్రమే పీఎం కిసాన్ నగదు జమ అవుతుందన్నారు. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద అర్హత కలిగిన లబ్ధిదారుల జాబితా సిద్ధంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

పెండింగ్ డీఏలను చెల్లించాలి

రాయచోటి అర్బన్: పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే చెల్లించాలని ఫ్యాప్టో జిల్లా కార్యవర్గం డిమాండ్ చేసింది. శనివారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఫ్యాప్టో జిల్లా కార్యవర్గసమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ,ఉపాధ్యాయులకు యిచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఫ్యాప్టో నేతలు జాబీర్, సుబ్రమణ్యంరాజు, జగన్‌మోహన్‌రెడ్డి, గోపాల్‌నాయక్, రాజారమేష్, శివారెడ్డి, సురేంద్ర, రామచంద్ర, గఫార్‌ఖాన్, ముజాహిద్దీన్, సిబాతుర్ రహిమాన్, హరిబాబు, నాదిర్‌షా పాల్గొన్నారు.

శ్మశానం ధ్వంసంపై రెవెన్యూ అధికారుల విచారణ



శ్మశాన స్థలాన్ని సర్వేచేస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

గుర్రంకొండ : ఇటీవల ప్రచురితమైన శ్మశానాన్ని ధ్వంసం చేసిన టీడీపీ నాయకులు అన్న కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. శనివారం ఆర్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం మండలంలోని టి.పసలవాండ్లపల్లెకు చేరుకొన్నారు. టి.పసలవాండ్లపల్లె, చాగలపల్లెకు మధ్యలో ఉన్న వివాదస్పద శ్మశాన స్థలాన్ని సర్వేచేయించారు. అక్కడ ధ్వంసానికి గురైన సమాధులను పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సదరు స్థలం ఉన్న సర్వే నెంబర్లను పరిశీలించారు. సర్వేనెంబరు 214లో ఉన్న మొత్తం విస్తీర్ణం 3.08 ఎకరాల స్థలం రాస్తాపోరంబోకుగా నిర్ధారించారు. అందులో నాలుగు దశాబ్దాలుగా సమాధులు వేసుకొంటున్న శ్మశాన స్థలం కూడా పట్టా స్థలం కాదని రాస్తాపోరంబొకులో ఉండేదని తేల్చారు. శ్మశాన స్థలం మొత్తం సర్వేచేసి నాలుగుసెంట్లు శ్మశానంకు కేటాయిస్తూ సరిహద్దు రాళ్లు నాటారు. దీంతో వివాదం సద్దుమనిగింది. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఆడిటింగ్ పూర్తి కావాలి

జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా పంచాయితీ అధికారి ధనలక్ష్మి

రాజంపేట టౌన్: 2021–2022 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిటింగ్ ఈనెలాఖరులోగా పూర్తి కావాలలని జిల్లా పంచాయతీ అధికారిణి (డీపీఓ) ధనలక్ష్మి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. డివిజన్‌లో ఇంకా పలు పంచాయితీలకు సంబంధించి ఆడిటింగ్ పూర్తి కాలేదన్నారు. స్థానిక న్యూ ఆంధ్ర కల్యాణ మండపంలో శనివారం ఈఓపీఆర్డీలు, పంచాయితీ కార్యదర్శులతో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా వివిధ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు, పారిశుధ్యం, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై సమీక్షించారు. స్వచ్ఛ భారత్‌లో వెనకబడిన పంచాయితీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య పక్షోత్సవాలను కొంత మంది కార్యదర్శులు నిర్వర్తించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పక్షోత్సవాల సందర్భంగా గ్రామాల్లో చేపట్టే పారిశుధ్య పనులకు సంబంధించిన ఫోటోలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసి పంపాలన్నారు.పంపని వారిపై ఈనెల 16వ తేదీ చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం పట్ల ప్రజలు నిర్లక్ష్య ధోరణి అవలంభించి ఇంటి పరిసర ప్రాంతాల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేయడం, హోటల్ నిర్వాహకులు రోడ్లపైకి మురుగు నీరు వదలడం వంటివి చేస్తే తొలుత నోటీసులు జారీ చేయాలన్నారు. అప్పటికి వారిలో మార్పు రాకుంటే కేసులు పెట్టాలని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడ కూడా కుక్కలు, కోతులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు విధిగా సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ప్రతి బుధవారం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సమీక్షించాలని తెలిపారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీఎల్‌పీఓ నాగరాజు, తొమ్మిది మండలాలకు చెందిన ఈఓపీఆర్డీలు, 165 పంచాయితీలకు చెందిన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం వేసుకోకపోతే రూ.200 జరిమానా

కొంత మంది గ్రామ సచివాలయ సిబ్బంది యూనిఫాం వేసుకోకుండా సమావేశానికి హాజరు కావడంపై డీపీఓ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనిఫాం వేసుకురాకపోవడానికి గల కారణాలను అడిగారు. యూనిఫాం వేసుకు రాని వారికి రెండు వందల రూపాయిల జరిమానా విధించాలని డీఎల్‌పీఓ నాగరాజును ఆదేశించారు. ఆ డబ్బులను అనాధ శరణాలయాలకు వితరణగా ఇవ్వాలని సూచించారు.